

సేఫ్టీ శిక్షణ కోసం వచ్చిన ఉత్తరప్రదేశ్ కార్మికులు



బయట రాష్ట్రాల కార్మికులను ప్లాంట్‌లోకి పంపిస్తున్న కాంట్రాక్టర్లు



స్పందనలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మిక నాయకులు

స్థానిక కార్మికులైతే వద్దు.. ఇతర రాష్ట్రాల వారే ముద్దు..



స్టీల్‌ప్లాంట్ ట్రైనింగ్ విభాగం గేటు వద్ద ఆందోళన చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

- స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం
- ఇటీవల ఐదు వేల మంది కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు
- వారి స్థానంలో ఇతర రాష్ట్రాల వారికి అవకాశం
- వారిని అడ్డుకుంటున్న కార్మిక సంఘాలు
- ఇంత జరుగుతున్నా నోరు మెదపని ప్రజాప్రతినిధులు

ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్‌లో ప్రస్తుతం విచిత్ర పరిస్థితి నెలకొంది. ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్న స్థానిక కాంట్రాక్ట్ కార్మికులను ఓ వైపు తొలగించేస్తూ... మరోవైపు ఇతర రాష్ట్రాల వారిని విధుల్లోకి తీసుకోవడం వెనుక ఉన్న కుట్ర ఎవరికీ అంతుచిక్కడం లేదు. ఇప్పటికే స్టీల్‌ప్లాంట్ నుంచి తొలగించిన కాంట్రాక్ట్ కార్మికుల భవిష్యత్ అంధకారంలోకి నెట్టబడింది. వారిని మరలా ప్లాంట్‌లోకి తీసుకునే పరిస్థితులు కనుచూపు మేరలో కనిపించడం లేదు. స్టీల్‌ప్లాంట్ ఆర్థిక సంక్షోభం నేపథ్యంలో ఉక్కు యాజమాన్యం ఉద్యోగుల తగ్గింపు, కాంట్రాక్ట్ కార్మికుల కుదింపు చర్యలకు ఆదేశించింది. ఇందులో భాగంగా ఉద్యోగులకు వాలంటరీ రిటైర్‌మెంట్ స్కీమ్ (వీఆర్‌ఎస్) రెండు సార్లు అమలు చేశారు. ఇక కాంట్రాక్ట్ కార్మికుల పరిస్థితి అయితే మరీ దారుణం. సుమారు 5 వేల మందిని అర్థాంతంగా తొలగించారు. విభాగాల్లో అదనంగా ఉన్నారనే యోచనతో యాజమాన్యం వారి గేటు పాసులను నిలిపేసింది. వారిలో నిర్వాసితులు కూడా ఉండటం గమనార్హం. ఒకవైపు సుమారు 8 వేల మంది నిర్వాసితులు ఉపాధి కోసం ఎదురు చూస్తుండగా... ప్రస్తుతం విధుల్లో ఉన్న నిర్వాసితుల్లో కొంత మందిని తొలగించడంతో వారు లబోదిబోమంటున్నారు. ఇదిలా ఉండగా 5 వేల మంది కార్మికులను తొలగించడాన్ని వ్యతిరేకిస్తూ... వారిని మళ్లీ చేర్చుకోవాలంటూ కాంట్రాక్ట్ కార్మిక సంఘాలు ఆందోళన చేస్తున్నాయి. ఇందులో భాగంగా ప్రజాప్రతినిధులను కలిసి కాంట్రాక్ట్ కార్మికులకు న్యాయం చేయాలంటూ కోరారు. రీజినల్ లేబర్ కమిషనర్ (ఆర్‌ఎల్‌సీ)కి ఉక్కు యాజమాన్యంపై కార్మిక సంఘాలు ఫిర్యాదు చేశాయి. ఆ తర్వాత ఆర్‌ఎల్‌సీ ఆ కేసును హైదరాబాద్‌లోని లేబర్ ట్రిబ్యునల్ కోర్టుకు రిఫర్ చేశారు. ప్రస్తుతం అక్కడ కేసు కొనసాగుతోంది. అదేవిధంగా స్పందనలో విశాఖ కలెక్టర్‌కు కూడా వినతిపత్రం అందజేశారు. దీనిపై చూస్తామని చెప్పడం మినహా ఎటువంటి హామీ లభించలేదు.

నిర్వాసితులైతే చూస్తామంటున్న ప్రజాప్రతినిధులు స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం తొలగించిన వారిలో కార్మిక సంఘాల లెక్కల ప్రకారం సుమారు 500 మంది నిర్వాసితులు ఉన్నారు. అయితే యాజమాన్యం లెక్కల ప్రకారం 270 మాత్రమే ఉన్నారు. మిగిలిన వారు ఆర్ కార్డు ఉన్నప్పటికీ సాధారణంగా నియామకం కావడంతో వారిని నిర్వాసితులుగా గుర్తించడం లేదు. నిర్వాసిత కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకునేందుకు ప్రయత్నిస్తామని చెబుతున్నారు తప్ప మిగిలిన కార్మికుల గురించి ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం శోచనీయం.

అడ్డుకుంటున్న కార్మిక సంఘాలు

ఇతర రాష్ట్రాల కార్మికులు సీటల్‌ప్లాంట్‌లో విధులు నిర్వహించేందుకు తీసుకోవడాన్ని కార్మిక సంఘాలు వ్యతిరేకిస్తూ ఆందోళనలు చేస్తున్నాయి. ఇందులో భాగంగా కార్మికులకు సేఫ్టీ శిక్షణ ఇచ్చే ట్రైనింగ్ విభాగం వద్ద గత రెండు రోజులుగా నిరసన కార్యక్రమాలు చేస్తూ వారిని అడ్డుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. కార్మిక సంఘాలను చూసి కాంట్రాక్టర్లు సేఫ్టీ శిక్షణ మమ అనిపించి దొంగదారిలో వారిని ప్లాంట్‌లోకి పంపిస్తున్నారని నాయకులు ఆరోపిస్తున్నారు.

ఇతర రాష్ట్రాల కార్మికుల తరలింపు

ఇదిలా ఉండగా స్టీల్‌ప్లాంట్‌కు చెందిన కాంట్రాక్టర్లు ఇటీవల తొలగించిన వారిని కాదని ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులను పనుల్లో పెట్టుకుంటున్నారు. అదనంగా ఉన్న వారిని తొలగించామని ఒక వైపు చెబుతూ... మరోవైపు ఒడిశా, జార్ఖండ్, ఛత్తీస్‌ఘఢ్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన కార్మికులను పెద్ద ఎత్తున డంప్ చేస్తున్నారు. స్థానికులకైతే కనీస వేతనాలు, పీఎఫ్, ఫైనల్, బోనస్, ఈఎస్‌ఐలు తప్పనిసరిగా చెల్లించాల్సి ఉంటుంది. అదే ఇతర రాష్ట్రాలకు చెందిన వారైతే వారికి తిండి, రవాణా సౌకర్యం ఏర్పాటు చేస్తే రోజుకు 12 గంటలైనా పని చేయించుకోవచ్చు. ఇచ్చినంత జీతం తీసుకుంటారు. ప్లాంట్‌లోని విశాఖ కన్‌స్ట్రక్షన్‌కు చెందిన సీడీవై యార్డులో అక్కడే ఇతర రాష్ట్రాల కార్మికులకు వసతి కల్పించి పనులు చేయించుకుంటున్నారు. అందుకే కాంట్రాక్టర్లు వేరే రాష్ట్రాల వారిని తీసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు.

స్థానికులకు ప్రాధాన్యమివ్వాలి



కాంట్రాక్టర్లు కొత్త పనుల్లో స్థానిక కార్మికులకు 75 శాతం ఉపాధి కల్పించాలి. గత ప్రభుత్వం ఈ అంశంపై జీవో కూడా జారీ చేసింది. ఆ జీవోను అమలు చేయాలి. ఇతర రాష్ట్రాల నుంచి కార్మికుల తరలింపు ఆపాలి. వారి స్థానంలో ఇటీవల తొలగించిన స్థానిక కార్మికులను చేర్చుకోవాలి. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తాం.

– నమ్మి రమణ, ప్రధాన కార్యదర్శి, సీఐటీయూ కాంట్రాక్ట్ కార్మిక సంఘం

ప్రజాప్రతినిధులు స్పందించాలి



స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకుంటామని, నిర్వాసితులకు ఉపాధి కల్పిస్తామని ఎన్నికల సమయంలో హామీలిచ్చిన ప్రజాప్రతినిధులు ఇప్పుడు వేలాది మంది కార్మికులను తొలగించి పక్క రాష్ట్రాల వారిని నియమించుకుంటుంటే ఏం చేస్తున్నారు. వెంటనే వారు స్పందించి ఉక్కు యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చి స్థానిక కార్మికులకు ఉపాధి కల్పించేలా చేయాలి.

– కె.వంశీకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్, ఐఎన్‌టీయూసీ కాంట్రాక్ట్ కార్మిక సంఘం

స్టీల్‌ప్లాంట్ ఆర్‌ఎంహెచ్‌పీలో 12 గంటల డ్యూటీ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ రామెటీరియల్ హ్యాండ్లింగ్ ప్లాంట్(ఆర్‌ఎంహెచ్‌పీ) విభాగంలో అధికారులకు గురువారం నుంచి 12 గంటల డ్యూటీలు వేశారు. స్టీల్‌ప్లాంట్‌కు అవసరమైన ముడిసరకు ఈ విభాగం నుంచే మిగిలిన విభాగాలకు సరఫరా చేస్తుంటారు. సాధారణంగా వర్షాకాలంలో ప్లాంట్ ఉత్పత్తికి అవసరమైన ముడిసరకు రవాణాకు అంతరాయం కలుగుతుంది. కన్వేయర్ బెల్టులు తెగిపోవడం, బేరింగ్ తదితర సాంకేతిక సమస్యల వల్ల రవాణాకు ఇబ్బందులు ఏర్పడతాయి. ఇటీవల మిగిలిన విభాగాలకు ముడి సరకు రవాణాలో అసాధారణ జాప్యం ఏర్పడి, ప్లాంట్ ఉత్పత్తికి అంతరాయం కలుగుతోంది. వీటిని ఎదుర్కొనేందుకు యాజమాన్యం అధికారులకు ఈ డ్యూటీలు వేసింది. వీరు రెండు వారాల పాటు ఉదయం 8 నుంచి రాత్రి 8 వరకు, రాత్రి 8 నుంచి ఉదయం 8 వరకు విధులు నిర్వహిస్తారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



శశికిరణ్‌కు బాండ్ అందిస్తున్న అధికారులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి గాజువాక దరి పెదగంట్యాడకు చెందిన వై.శశికిరణ్ రూ.లక్ష విరాళాన్ని నగదు రూపంలో అందించారు. దేవస్థానం తరఫున దాతకు పీఆర్వో కార్యాలయం సూపరింటెండెంట్ ప్రసన్న లక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణ బాండ్ ఇచ్చారు. ఆలయ అధికారులు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం అందజేశారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



అవగాహన సదస్సులో పాల్గొన్న సీఐలు

గాజువాక : ప్రస్తుతం చోటు చేసుకుంటున్న వివిధ రకాల సైబర్ నేరాలపై బజాజ్ ఫైనాన్స్ కంపెనీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. స్థానిక టీఎస్సార్, టీబీకే కళాశాలలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో సీఐ పార్థసారథి, క్రైం సీఐ కె.శ్రీనివాసరావు తదితరులు ప్రసంగించారు. సైబర్ నేరాలు జరిగే తీరు, నేరాలకు పాల్పడే వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, వాటిపట్ల ఏ విధంగా అప్రమత్తంగా ఉండాలన్న విషయాలను వివరించారు. ఓటీపీల మోసం, ఫిషింగ్ మోసం, డిజిటల్ అరెస్ట్, ఆర్థిక రుణాల మోసాలు తదితర అంశాలను, ఆయా సందర్భాల్లో పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు.

క్లుప్తంగా

ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణానికి నష్టం



అవగాహన ర్యాలీలో తిరుమలనగర్ వాసులు

కూర్మన్నపాలెం : సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ఎంతో నష్టం జరుగుతుందని తిరుమలనగర్ వాసులు, పారిశుద్ధ్య సిబ్బంది అవగాహన కల్పించారు. ముందుగా వీరు గురువారం 87వ వార్డులో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్, పాలిథిన్ వినియోగంతో జరిగే అనర్థాలను వివరించారు. అనంతరం ఇటీవల కురిసిన వర్షాలకు రహదారులపై నిలిచిన నీటిని తొలగించారు. అలాగే వాహనాల రాకపోకలకు అడ్డుగా ఉన్న పిచ్చి మొక్కలను నరికి శుభ్రం చేశారు. కార్యక్రమంలో తిరుమలనగర్ వాసులు పరమానందం, విశ్వేశ్వరరావు, రాము, ఉదయశంకర్, జీవానందం, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

13 నుంచి మెడిటేషన్ తరగతులు

కూర్మన్నపాలెం : ఈ నెల 13 నుంచి రెండు రోజులపాటు మెడిటేషన్‌పై శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు రామచంద్ర కన్స్యూనెస్ సంస్థ తెలిపింది. కూర్మన్నపాలెం శాతవాహననగర్ ఎస్‌ఎస్‌కే టవర్సులో తరగతులు నిర్వహిస్తామని సంస్థ ప్రతినిధి వై.నారాయణమూర్తి తెలిపారు. 18 నుంచి 60 ఏళ్ల మధ్య వయసున్న వారు హాజరుకావచ్చని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 12న పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

వ్యాధులపై అప్రమత్తత అవసరం



వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి భవ్య

పెదగంట్యాడ : వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని నమ్మిదొడ్డి యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ భవ్య సూచించారు. ఇస్లాంపేట ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయలకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్త్రీలలో వచ్చే పలు క్యాన్సర్లపై తెలియజేశారు. ముందస్తు పరీక్షలు చేయించుకుంటే వెంటనే గుర్తించి చికిత్సతో నివారించవచ్చని తెలిపారు. యూపీహెచ్‌సీ పరిధిలో ఇప్పటికే చాలా మందికి పరీక్షలు నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రమీల, సిబ్బంది సుశీల, శ్రావణిపాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ చర్యలు దుర్మార్గం

బీచ్‌రోడ్డు: చంద్రబాబు అధికారంలోకి వచ్చిన 15 నెలల వ్యవధిలో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్‌కు అప్పగించేందుకు పెద్ద ఎత్తున ప్రయత్నాలు జరుగుతున్నాయంటూ ఏఐవైఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు కె.అచ్యుత్, వై.రాంబాబు ధ్వజమెత్తారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద గురువారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా పోరాటం జరగాల్సిన అవసరముందన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా ప్రైవేటీకరణ ప్రక్రియను వేగవంతం చేసినట్లే, రాష్ట్రంలో సీఎం చంద్రబాబు అదే దారిలో నడుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యా, వైద్య రంగాలను పూర్తిగా ప్రైవేటుపరం చేయడంపై ఆందోళన వ్యక్తం చేశారు. పర్యాటక రంగంలో రూ.10 వేల కోట్ల విలువైన 22 హోటళ్లు, రిసార్ట్‌లు, ఆస్తులను ప్రైవేట్‌పరం చేయడం దారుణమన్నారు. తాజాగా 10 ప్రభుత్వ వైద్య కళాశాలలను పీపీపీ విధానంలో ప్రైవేటీకరణకు అప్పగించడం అత్యంత దుర్మార్గమన్నారు. ఆదోని, మదనపల్లె, మార్కాపురం, పులివెందుల, పెనుగొండ, పాలకొల్లు, అమలాపురం, నర్సీపట్నం, బాపట్ల, పార్వతీపురం కళాశాలలు ఈ జాబితాలో ఉన్నాయని వివరించారు. విజయవాడ గవర్నరుపేట ఆర్టీసీ డిపోతోపాటు, విశాఖలోని ఆర్టీసీ స్థలాలను లూలూ సంస్థకు అప్పగించేందుకు తీసుకున్న నిర్ణయం కూడా ఇదే కోవలోదన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోని పాఠశాలల నుంచి ఇంటర్, ఇంజినీరింగ్, వైద్య కళాశాలలు, విశ్వవిద్యాలయాలన్నీ ప్రైవేటు మయమైపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంజినీరింగ్ విద్య అంటే వీఐటీ, ఎస్‌ఆర్‌ఎం, కేఎల్యూ, గీతం వంటి ప్రైవేట్ యూనివర్సిటీల పేర్లే వినిపిస్తున్నాయని, ఇంటర్ విద్య అంటే నారాయణ, చైతన్య కళాశాలలే గుర్తుకొస్తున్నాయని ఎద్దేవా చేశారు. విద్యా శాఖ మంత్రిగా నారా లోకేశ్‌ను నియమించినప్పటికీ ఫలితం లేదని, మొత్తం విద్యా, వైద్య రంగాలను ప్రైవేట్‌కు అప్పగించడం తగదని వ్యాఖ్యానించారు. మధురెడ్డి, భీమరాజు పాల్గొన్నారు.

ఓవర్ లోడింగ్ ఆటోలపై కఠిన చర్యలు



ఆటో డ్రైవర్లు, విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ వెంకటరావు

ఉక్కునగరం: ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తే కఠిన చర్యలు తప్పవని సౌత్ ట్రాఫిక్ విభాగ సీఐ వెంకటరావు హెచ్చరించారు. గురువారం శ్రీచైతన్య జూనియర్ కళాశాల, ఉక్కునగరం డీఏవీ పాఠశాలల కూడళ్ల వద్ద ఆటో డ్రైవర్లకు, విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యంగా పాఠశాల విద్యార్థులు ప్రయాణించే ఆటోలకు కుడి, ఎడమ వైపు సేఫ్టీ రాడ్లు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఆటోల వెనుక భాగంలో పిల్లల్ని కూర్చోబెట్టడం నేరమన్నారు. వెనుక వైపు వారి బ్యాగ్‌లు మాత్రమే ఉంచాలన్నారు. ఇటీవల నగరంలో జరిగిన పలు ప్రమాదాలను వివరించారు. ఆటోల్లో పెద్ద సౌండ్లు ఏర్పాటు ద్వారా శబ్ద కాలుష్యంతో పాటు వెనుక వచ్చే వాహనాల శబ్దం కడా వినపడదన్నారు. విద్యార్థులు ప్రయాణిస్తున్నప్పుడు స్పీడ్ బ్రేకర్ల వద్ద అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యార్థులతో మాట్లాడుతూ రోడ్డు దాటేటప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. రెడ్ సిగ్నల్ పూర్తిగా ఆగిన తర్వాత మాత్రమే రోడ్డు దాటాలన్నారు. నిర్ణీత వయసు వచ్చే వరకు వాహనాలు నడపరాదన్నారు. మైనర్ డ్రైవింగ్ చేస్తే పట్టుబడిన పిల్లలతోపాటు, తల్లిదండ్రులపైనా చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్‌ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

నగరంలో పారిశుధ్యం మెరుగుకు కృషి

- ఉదయం 6 నుంచే అధికారులు, సిబ్బంది విధుల్లో ఉండాలి
- జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్
- జోన్–3, 4ల్లో క్షేత్ర పర్యటన

డాబాగార్డెన్స్: ప్రజారోగ్యం దృష్ట్యా నగర పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని అధికారులకు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ సూచించారు. క్షేత్ర పర్యటనలో భాగంగా గురువారం జోన్–3, 4 జోనల్ కార్యాలయ పరిధిలోని 19, 20, 30 వార్డుల్లో ఆయన పర్యటించారు. ముందుగా జోన్–4 పరిధి 30వ వార్డు జగదాంబ జంక్షన్, లేపాక్షి జంక్షన్, పూర్ణా మార్కెట్ తదితర ప్రాంతాల్లో పర్యటించి శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులు, పారిశుధ్య కార్మికుల హాజరును ఫోన్‌లో పరిశీలించారు. వ్యర్థాలు చాలా చోట్ల కనిపిస్తున్నాయని, విధుల్లో అలసత్వం వహించరాదని వారికి సూచించారు. ప్రజారోగ్య అధికారులు, సిబ్బంది ఉదయం 6 గంటల నుంచే విధుల్లో ఉండేలా చర్యలు చేపట్టాలని జోన్ల కమిషనర్లను వాకీటాకీ ద్వారా ఆదేశించారు.

వ్యాపారులకు వెండింగ్ జోన్‌లో అవకాశం

అనంతరం జోన్–3 పరిధి ఉషోదయ జంక్షన్ నుంచి రామలక్ష్మి అపార్ట్‌మెంట్ వరకు కమిషనర్ పర్యటించారు. డ్రోన్ ద్వారా ఆయన పరిశీలించగా వ్యర్థాలు ఎక్కడపడితే అక్కడ అధికంగా కనిపిస్తున్నాయని శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రామలక్ష్మి అపార్ట్‌మెంట్ వద్ద రోడ్డును ఆక్రమించి కూరగాయలు విక్రయిస్తున్న వ్యాపారి దుకాణం తొలగించి, ప్రతి జోన్‌లో ఏర్పాటు చేస్తున్న వెండింగ్ జోన్‌లో వారికి ఒక దుకాణం కేటాయించాలే చూడాలని జోనల్ కమిషనర్ శివప్రసాద్‌ను ఆదేశించారు. ఉషోదయ జంక్షన్‌లోని ఫ్రీ లెఫ్ట్‌లో ఆక్రమణలో ఉన్న బడ్డీలు వెంటనే తొలగించి, ఆ చిరు వ్యాపారులకు వెండింగ్ జోన్‌లో అవకాశం కల్పించాలని, కూడలిలో వాహనాల రాకపోకలకు ఫ్రీ లెఫ్ట్‌లో 50 మీటర్ల వరకు ఆక్రమణలు లేకుండా చూడాలని ఆదేశించారు. పర్యటనలో ఏఎంహెచ్‌వో ఒ.బి.ప్రసాదరావు, శానిటరీ సూపర్‌వైజర్ సత్యనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్స్ మంజూరుపై సమీక్ష

ఎంవీపీ కాలనీ : జిల్లాలోని పోస్ట్‌మెట్రిక్ స్థాయి విద్యార్థుల పెండింగ్ స్కాలర్‌షిప్స్ మంజూరుపై జిల్లా సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం గురువారం నిర్వహించారు. ఎంవీపీ కాలనీ సమత కళాశాలలో జరిగిన సమీక్షలో జిల్లా సాంఘిక సంక్షేమశాఖ డీడీ రామారావు పాల్గొని ఉమ్మడి విశాఖ జిల్లాకు సంబంధించిన కళాశాలల ప్రిన్సిపల్స్, వెల్ఫేర్ అసిస్టెంట్స్, సచివాలయాల కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 61 వేల మంది విద్యార్థులు పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్స్‌కు అర్హులన్నారు. వివిధ కారణాల వల్ల సగానికిపైగా విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ అందలేదన్నారు. సచివాలయాల లాగిన్స్, ప్రిన్సిపల్ లాగిన్స్‌తోపాటు బయోమెట్రిక్ సమస్యలు కారణంగా ఆయా దశల్లో దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. వీటిలో సచివాలయాల స్థాయిలో 20 వేలు, ప్రిన్సిపల్స్ స్థాయిలో 3,850, బయోమెట్రిక్, ఇతర సమస్యలతో 11,950 వేల అప్లికేషన్లు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. ఆయా దరఖాస్తులను త్వరితగతిన ప్రోసెస్ చేయాలని సూచించారు. అవసరమైన 5 స్టెప్స్ వెరిఫికేషన్స్‌పై మరోసారి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలువురు సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.

తవ్వి.. వదిలేయడంతో అవస్థలు

- పెదగంట్యాడ ప్రధాన రహదారిలో రాకపోకలకు ఇబ్బందులు



పెదగంట్యాడ ప్రధాన రహదారిలో పవర్ కేబుల్ పనుల కోసం తీసిన గోతులు



రోడ్డుకి అడ్డంగా కేబుల్ తీసుకొచ్చిన చక్రం



గోతులు కారణంగా వాహనాలు నెమ్మదిగా వెళ్లడంతో స్తంభించిన ట్రాఫిక్

పెదగంట్యాడ : అండర్ గ్రౌండ్ పవర్ కేబుల్ పనులంటూ రోడ్లన్నీ తవ్వి వదిలేయడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా పెదగంట్యాడ ప్రధాన రహదారిలో రాకపోకలు సాగించేందుకు స్థానికులు నరకయాతన అనుభవిస్తున్నారు. నిత్యం వేలాది మంది ప్రయాణించే ఈ మార్గంలో అండర్ గ్రౌండ్ కేబుల్ వర్క్ పేరుతో 15 రోజుల క్రితం రోడ్డుపై పెద్ద కాలువల మాదిరిగా తవ్వి వదిలేశారు. అనంతరం పనులు చేపట్టకుండా అలా వదిలేయడంతో ఇటీవల కురిసిన వర్షాలతో రోడ్డంతా బురదమయంగా మారింది. దీంతో స్థానికులతోపాటు, వాహనచోదకులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారిలో ఇలాంటి పనులు చేపట్టినప్పుడు ఎక్కువగా సిబ్బందిని ఏర్పాటు చేసి త్వరత్వరగా పనులు పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి. అందుకు భిన్నంగా రోజుల తరబడి పనులు చేపట్టకుండా తవ్వి వదిలేస్తే తాము ఇబ్బందులకు గురవుతున్నామని స్థానికులు మండిపడుతున్నారు. అంతే కాకుండా రాత్రి వేళల్లో ఆదమరిస్తే గోతుల్లో పడి ప్రమాదాలకు గురవుతామని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి త్వరత్వరగా పనులు పూర్తి చేసి గోతులను పూడ్చాలని కోరుతున్నారు.

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన



రోడ్డు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న టాటా ప్రాజెక్ట్ అధికారులు

పెదగంట్యాడ : జీవీఎంసీ 76వ వార్డు పరిధిలోని బర్మా కాలనీ సమీపంలో నిర్మించిన టిడ్కో గృహ సముదాయం వద్ద చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులను టాటా ప్రాజెక్ట్ అధికారులు గురువారం పరిశీలించారు. టిడ్కో డీఈ రాజేష్ చంద్ర, ఏఈలు రవికుమార్, బిపిన్ చంద్ర, టాటా ప్రాజెక్ట్ ఏఈ గోపాల్ తదితర బృందం ముందుగా గృహాలను పరిశీలించారు. ఆపై సౌకర్యాల కల్పనపై చర్చించారు. ఈ సందర్భంగా టిడ్కో ఏఈ రాజేష్ చంద్ర మాట్లాడుతూ పది రోజుల్లో గృహ సముదాయానికి మౌలిక వసులు కల్పిస్తామన్నారు. అన్ని పనులు పూర్తి చేసిన తర్వాత లబ్ధిదారులకు ఇళ్లు అందజేస్తామని తెలిపారు. అధికారుల బృందంతో పాటు సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ, ఆనంద్ పాల్గొన్నారు.

13 నుంచి గర్భాశయ క్యాన్సర్ నివారణ వ్యాక్సినేషన్

మహారాణిపేట: ఆడపిల్లలకు గర్భకోశ ముఖద్వార క్యాన్సర్ రాకుండా ఉండేందుకు ఈ నెల 13 నుంచి 16 వరకు సీతమ్మధారలోని లయన్స్ క్యాన్సర్ ఆస్పత్రిలో ఉచిత వ్యాక్సినేషన్ శిబిరం నిర్వహిస్తున్నట్లు చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షురాలు, లయన్స్ క్లబ్ ఆఫ్ వైజాగ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ డాక్టర్ షిరీన్ రెహమాన్ తెలిపారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో 9 నుంచి 14 ఏళ్ల వయసు లోపు బాలికలకు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు క్యాన్సర్ నివారణ వ్యాక్సిన్ ఉచితంగా వేస్తామని పేర్కొన్నారు. ఇదివరకు మొదటి డోస్ వేసుకొని ఆరు నెలల సమయం గడిచిన వారికి రెండో డోస్ వేసుకునే అవకాశం కల్పిస్తున్నామని డాక్టర్ షిరీన్ రెహమాన్ తెలిపారు.

రోడ్డు ప్రమాద బాధితులకు పరిహారం అందజేత

విశాఖ సిటీ : రోడ్డు ప్రమాదంలో మృతుని కుటుంబ సభ్యులకు, క్షతగాత్రులకు నగర పోలీస్ కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రమాద బాధితుల సహాయక కేంద్రం ద్వారా రూ.3 లక్షలు పరిహారం అందజేశారు. హిట్ అండ్ రన్‌లో అనకాపల్లి జిల్లా పిసినికాడ గ్రామానికి చెందిన ఎడ్ల హేమంత్‌కుమార్ ఇటీవల మృతి చెందాడు. దీంతో అతని భార్య వరలక్ష్మికి రూ.2 లక్షలు అందజేశారు. అలాగే హిట్ అండ్ రన్‌లో కేసులో క్షతగాత్రులైన అనుపోజుల దుర్గారావు, నేబర్తి కనకారావులు ఒక్కొక్కరికీ రూ.50 వేలు చొప్పున ఇచ్చారు. హిట్ అండ్ రన్ కేసుల్లో సహాయం కోసం 7995095793 టోల్‌ఫ్రీ నెంబర్‌కు సంప్రదించవచ్చన్నారు.